ప్రజాశక్తి
శుక్రవారం 11 ఆగస్టు 2023

ఆజాదీ కాఅమృత మహోత్సవం లో భాగంగా హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని ప్రచారం చేస్తూ పట్టణంలో ప్రముఖులకు స్థానిక సర్కిల్ తపాలా శాఖ సిబ్బంది జాతీయ జెండాలను బహూకరించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టరు నిశాంత్‌కుమార్‌కు జెండాను అందజేశారు. కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ పిన్స్ కుమార్ సిద్దార్థ, సిబ్బంది దినేష్ పాల్గొన్నారు.
- ప్రజాశక్తి, పార్వతీపురం

బొత్సపై కళా పోటీ?

- యోచిస్తున్న టిడిపి అధిష్టానం
- పార్వతీపురం, కురుపాం అభ్యర్థులూ దాదాపు ఖరారు
- బాబు పర్యటనతో ఎన్నికలకు సమాయత్తమవుతున్న తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణపై టిడిపి తరపున ఈ సారి టిడిపి సీనియర్ నేత మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావును పోటీలో దింపేదిశగా అధిష్టానం ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. మరోవైపు బుధవారం నాటి మన్యం జిల్లా పర్యటనలో పార్వతీపురం, కురుపాం అసెంబ్లీ స్థానాలను బొనెల విజయ చంద్ర, తోయక జగదీశ్వరిలకు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఖరారు చేసినట్టుగా చర్చ నడుస్తోంది. ఇందుకు తగ్గట్టే వీరికి సహకరించాలంటూ చంద్రబాబు పిలుపునిచ్చారు. బాబు పర్యటనతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని తెలుగు తమ్ముళ్లకు ఎన్నికల వేడి తాకింది. మంగళవారం రాత్రికి విజయనగరం చేరుకున్న బాబును కలిసేందుకు బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. వీరితో పార్టీ కార్యాలయం కళకళలాడింది. తోటపల్లి ప్రాజెక్టు పరిశీలన అనంతరం జరిగిన సభలోనూ, పార్వతీపురంలో నిర్వహించిన సభలోనూ పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ రెండుచోట్ల జరిగిన సభల్లో విజయచంద్ర, జగదీశ్వరిలను ప్రత్యేకించి పరిచయం చేస్తూ, వారికి సహకరించాలని కోరడంతో వారి అనుయాయుల్లో ఉత్సాహం నెలకొంది. ఇటు వైసిపికి చెందిన సీనియర్ నేత, మంత్రి బొత్స సత్యనారాయణ చీపురుపల్లి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం విధితమే. ఈయన రాష్ట్ర రాజకీయాల్లోనూ, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో ఎత్తుకుపై ఎత్తులు వేసి, ప్రత్యర్థుల వ్యూహాలను సైతం తలకిందులు చేయగలిగిన నాయకులు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో బొత్సను టార్గెట్ చేయాలని టిడిపి అధిష్టానం యోచిస్తోంది. తద్వారా బొత్సను తన నియోజకవర్గానికి పరిమితం చేస్తే, ఉత్తరాంధ్ర మొత్తం ఆయన ప్రభావం లేకుండా ఉంటుందన్నది టిడిపి ఎత్తుగడ. ఇటీవల జరిగిన నియోజకవర్గ సమీక్షా సమావేశంలో చంద్రబాబు ఈ మేరకు దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. ఈ ప్లాన్ అమలు కావాలంటే గత ఎన్నికల్లో పోటీచేసిన కిమిడి నాగర్జున సరిపోరని, అందువల్ల సీనియర్ నేతగా, మాజీ మంత్రిగా గుర్తింపువున్న కళా వెంకటరావును దించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. బొత్సను కళా వెంకటరావు ధీటుగా ఎదుర్కొంటారనేది టిడిపి ఆలోచనగా తెలుస్తోంది. కళా నివాస ప్రాంతం కూడా జిల్లాల పునర్విభజనలో భాగంగా విజయనగరం జిల్లాలో అంతర్భాగమైంది. ఈనేపథ్యంలో ఆయన రాజకీయాలను ప్రభావితం చేయగలుగుతారని పలువురు విశ్లేషిస్తున్నారు. చీపురుపల్లి నియోజకవర్గం టిడిపిలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న త్రిమూర్తులు రాజుకు కూడా ఈ రకమైన సంకేతాలు పార్టీ ఇచ్చినట్టుగా చర్చ నడుస్తోంది. బొత్సకు ధీటైన అభ్యర్థిగా ఎవరు వచ్చినా మనస్ఫూర్తిగా పనిచేయాలంటూ కోరినట్టు సమాచారం. ఈనేపథ్యంలో చీపురుపల్లి రాజకీయాలు ఆసక్తికరంగా మారనున్నాయనే చర్చ నడుస్తోంది.

కురుపాం టిడిపి అభ్యర్థిగా జగదీశ్వరి?

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మూడుముక్కలాటకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ఎట్టకేలకు తెరపడినట్టు విశ్వాసనీయ సమాచారం. బుధవారం తోటపల్లి ప్రాజెక్టు పరిశీలనకు వచ్చి అనంతరం గురువారం పార్వతీపురంలో కురుపాం నియోజకవర్గ టిడిపి నాయకులతో జరిగిన సమావేశంలో అందరూ కలిసి ఇన్‌ఛార్జి జగదీశ్వరికి గెలుపునకు కృషి చేయాలని చెప్పి అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థిగా జగదీశ్వరిని ప్రకటించినట్లు సమాచారం. అంతవరకు బాగానే ఉన్నా ఆమె ప్రకటనపై ఆమె వర్గమంతా హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ ఇప్పుడే అసలు కథ మొదలయ్యింది. ఇటు టిడిపి టిక్కెట్ ఆశిస్తున్న దత్తి లక్ష్మణరావు గ్రూపులోని ఐదుగురు ఆశావాసులు, మిగతా నాయకులు అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఆమెతో కలిసి పని చేస్తారా లేదో అనేది వేచి చూడాల్సి ఉంది.

వీరఘట్టంలో జరిగిన రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబునాయుడు

సైకో పాలనకు చరమగీతం పాడాలి : చంద్రబాబు

ప్రజాశక్తి-పాలకొండ/వీరఘట్టం/సీతంపేట

రాష్ట్రంలో సైకో పాలన జరుగుతుందని, అందరూ కలిసి చరమగీతం పాడాలని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం పార్వతీపురం మీదుగా ప్రజాభేరి యాత్రలో భాగంగా వస్తుండగా కార్గిల్ పాయింట్ వద్ద కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఆయన వాహనం దగ్గరకు వెళ్లి జై సిఎం అంటూ నినాదాలు చేశారు. దీంతో ఆయన అక్కడ ఉన్న వారినుద్దేశించి వారు మాట్లాడుతూ పాలకొండ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, మళ్లీతాము అధికారంలోకి వచ్చాక ఈ ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం ద్వారా వచ్చే డబ్బులు ఏమవుతున్నాయి

పక్క రాష్ట్రం నుంచి మద్యం సరఫరా అవుతుందని, వాటికి సంబంధించి డబ్బులు ఏమవుతున్నాయని చంద్రబాబు ప్రశ్నించారు. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద రోడ్డుషో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి సైకో పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. టిడిపికి అందరూ అండగా నిలవాలని, టిడిపికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు, పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, సీనియర్ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, పొన్నాడ నాగేశ్వరరావు, గొర్లె హరిబాబు, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, మండల యువత అధ్యక్షులు మాచర్ల అనీల్, బల్లా హరిబాబు, తూముల రమేష్, చింతా ఉమామహేశ్వరరావు, పి.మహేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీతంపేట : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీతంపేటలో ప్రజలకు అభివాదం చేశారు ముందుగా శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో బహిరంగ సభ ముగించుకొని రాత్రి సీతంపేట రోడ్డుపై వెళ్తుండగా టిడిపి పాలకొండ నియోజకవర్గం అధ్యక్షులు బిడ్డిక దమయంతి నాయుడు, మండల అధ్యక్షుడు సవర తోట మొఖలింగం, కార్యకర్తలు, ప్రజలు వాహనాన్ని ఆపగా, చంద్రబాబు వారికి అభివాదం తెలిపారు.

వీరఘట్టంలో జెండాను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోనే కోమటివీధి పాఠశాల ఆవరణలో గురువారం యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎస్.మహేష్, ఎస్.రాజేశ్వరి పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం.పైడిరాజు, కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, కె.గౌరు నాయుడు, వి.శ్రీధర్, వి.అన్నాజీ రావు, ఎ.చంద్రమోహన్, కె.గోవిందరావు, వి.నరసింగరావు, పి.మురళీకృష్ణ, దివాకర్, మల్లేశ్వరరావు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భామిని : యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని భామిని ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ పతాకాన్ని మండల శాఖ అధ్యక్షులు ఈగల తిరుపతిరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అధ్యక్షులు మాట్లాడుతూ విద్యా రంగం పరిరక్షణకు, ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారానికి యుటిఎఫ్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కడ్రాక ప్రసాద్, కె. క్రాంతి కుమార్, పంటల తిరుపతిరావు, లుడాతచిన్, ఎన్. రమేష్, టి. వెంకటరమణ వున్నారు.

డోర్ టు డోర్ సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఓటరు లిస్టు వెరిఫికేషను, ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమం నిబంధనల మేరకు జరుగుతున్నట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఇంటింటి ఓటరు సర్వేపై జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరు నిశాంత్‌కుమార్ జిల్లాలో జరుగుతున్న డోర్ టు డోర్ సర్వే వివరాలను తెలియజేస్తూ జిల్లాలో 274327 డోరు నెంబర్లు గలవని వాటిలో 138055 డోర్ నెంబర్లు బూత్ లెవల్ అధికారులు వ్యక్తిగతంగా పరిశీలన పూర్తయిందని, 2245 డోర్ నెంబర్లు బిఎల్ఒ యాప్‌లో పరిశీలన పూర్తయినట్లు తెలిపారు. జిల్లాలో 18 ఏళ్ల నిండిన యువత 4072 మంది ఉండగా, 4020 మంది నుంచి ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెండు సమావేశాలు నిర్వహించామని, ఒకే డోరునెంబరులో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వివరాలు, నూరేళ్లుదాటిన వారి వివరాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రిటర్నింగు, మండల మండల అధికారులు, బూత్ లెవల్ అధికారులతో నిత్యం మాట్లాడుతూ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేస్తున్నట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు, హెచ్ సెక్షను సూపరింటెండెంటు డి.రవికుమార్ పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషను పనులు వెంటనే పూర్తిచేయాలి

రీ సర్వేపూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషను పనులను వెంటనే పూర్తిచేయాలని సర్వే అండ్ సెటల్మెంటు కమిషనరు సిద్దార్థ జైన్ తెలిపారు. గురువారం జిల్లాకలెక్టరు, జాయింటు కలెక్టర్లతో రీసర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ఫైనల్ ఆర్ఒఆర్ పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ఫ్లాంటేషను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నిర్ణీత షెడ్యూలు ప్రకారం రీసర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఫైనల్ ఆర్ఒఆర్, స్టోన్ ఫ్లాంటేషను, ఇ-కెవైసీ సకాలంలో పూర్తిచేస్తామని, ప్రభుత్వ భూములు, రోడ్లు గుర్తించి హద్దులు నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో జెసి ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకటరావు, సర్వేశాఖ సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

శిక్షణను ప్రారంభిస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు

మాతా, శిశు సంరక్షణ బాధ్యతాయుతమైంది

ప్రజాశక్తి -పాలకొండ రూరల్

మాతా, శిశు సంరక్షణ ఎంతో బాధ్యతా యుతమైనదని ఆ దిశగా నర్సులు, మిడిల్ లెవెల్ ప్రొవైడర్లు అవగాహనతో పనిచేయాలని స్థానిక ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ నాగభూషణరావు అన్నారు. మాతా, శిశు సంరక్షణ చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించేలా న్యూ హెల్త్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగభూషణరావు మాట్లాడుతూ తల్లి, బిడ్డలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పూర్తిగా అవగాహన చేసుకుని వారికి వివరించి చెప్పాలన్నారు. అందుకోసం సమాచారానికి పలు రకాల మాధ్యమాలను వినియోగించి అర్ధమయ్యేలా తల్లులకు, వారి కుటుంబ సభ్యులకు తెలపాలన్నారు. చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ జె.రవీంద్ర కుమార్ మాట్లాడుతూ తల్లులకు, వారి సహాయకులకు పౌష్టిక ఆహారం ఏ సమయంలో ఏ పరీక్షలు చేయించుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. మొబైల్ యాప్‌ల ద్వారా కూడా సమాచారం లభ్యమవుతుందని తెలిపారు. రెండు రోజుల్లో సుమారు 300 మంది హెల్త్ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాప్రగతిపై దృష్టి పెట్టాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాప్రగతిపై దృష్టి పెట్టాలని అన్నారు. గురువారం విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. బోధన సక్రమంగా సాగాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దష్టి పెట్టాలని అన్నారు. అలాగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఐటిడిఎలో ఘనంగా నిర్వహించాలన్నారు. ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఉత్తమ ఉద్యోగులకు ఇచ్చే సర్టిఫికెట్లను తయారు చేయాలన్నారు. ఉద్యోగుల వివరాలు కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి వచ్చే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి శ్రీనివాసరావు, డిప్యుటీ డిఇఒ లిల్లీరాణి, ఎటిడబ్ల్యుఒలు మంగవేణి, కృష్ణవేణి, గురుకులం సెల్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు, డిడి సెక్షన్ సూపరిండెంట్ దేశ్, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్, పిఎంఆర్‌సి సిబ్బంది పి.కోటిబాబు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్నఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

18న సాలూరులో జాబ్‌మేళా

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకొన్న 18 నిండి 30 ఏళ్ల మధ్య గల నిరుద్యోగ యువతకు ఈనెల 18న సాలూరులోని ప్రభుత్వ డిగ్రీకాలేజీలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి యూ.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు పలు కంపెనీల ప్రతినిధులు హాజరౌతారన్నారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమ వివరాలను www.apss-dc.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమే, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్,1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8555909899, 7993795796కు సంప్రదించాలన్నారు.

పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నా

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని 18వ వార్డు పరిధిలో గల చిన కుమ్మరి వీధి, దుర్గానవీధి, నాయుడువీధుల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటిని సందర్శించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పథకాల మంజూరుకు సంబంధించిన సమాచారంతో కూడిన బుక్లెట్లను ఇంటింటికి పంపిణీ చేశారు. సంక్షేమ సహాయకులు కుటుంబాలకు అందిన ప్రయోజనాలను చదివి వినిపించారు. లబ్ధిదారులతో మాట్లాడిన ఉపముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలని, తద్వారా సామాజిక హెూదా రావాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. పేదల సొంతింటి కల సాకారం కావాలని, జిల్లాలో దాదాపు 24 వేల ఇళ్లు మంజూరు చేశారని, పార్వతీపురం, సాలూరులో ఏపీ టిడ్కో పక్కా ఇళ్లను నిర్మిస్తోందని చెప్పారు. ఇళ్లను పూర్తి చేసేందుకు లబ్ధిదారులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. గృహాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని, లబ్ధిదారులు గృహ ప్రవేశం త్వరగా చేస్తే చూడాలని వేచి చూస్తుందన్నారు. పేదల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వైఎస్ఆర్ కల్యాణ మస్తు పథకం కింద బుధవారం 697 జంటలకు రూ.4.95 కోట్ల ఆర్థిక సాయం జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పువ్వల శ్రీనివాస్ భరత్, మున్సిపల్ వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, మాజీ కౌన్సిలర్ కొల్లి వెంకటరమణ, వైసిపి నాయకులు చొక్కాపు గోపి, పతివాడ శివ పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కడగండి సచివాలయం పరిధిలో గురువారం పెద్ద వంగర, పొల్లం గూడ, చిన్నవంగర, గొలికుప్ప గూడ, రోలిగుడ్డి, సారంగి, సారంగి కొత్తగూడ, తోతలు గూడ, మొక్కరాయిమానుగూడ, కోడిపిల్ల గూడ, గౌరిపాలెం, చిన్నగౌరిపాలెం, బెంజిరి గూడ, మోన్ పాయి, రాయిమనుగూడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావతి పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సవర లక్ష్మి, ఎంపిపి బిడ్డిక.ఆదినారాయణ, వైస్ ఎంపిపి కూరంగి సరస్వతి, స్థానిక సర్పంచులు సవర సువార్త, నిమ్మక సింహాచలం, కొండగొర్రి కుమారి, సర్పంచులు ఆరిక కళావతి, హిమరక ఆదిలక్ష్మి, సున్నపురం రవి, గొయిది ఎంపిటిసి నిమ్మక హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడికి బుక్‌లెట్‌ను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

నేడు ఆహార కమిషన్ సభ్యులు రాక

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఈనెల 11న జిల్లాలో పర్యటిస్తారని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆహార కమిషన్ సభ్యులు ఇ.లక్ష్మీరెడ్డి, జి.దేవి జిల్లాలో పర్యటించనున్నట్టు ఆయన చెప్పారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం, క్షేత్ర స్థాయిలో పర్యటన ఉంటుందని తెలిపారు. సమావేశానికి వివిధశాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

వసతి గృహానికి సొంత భవనం నిర్మించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- సీతంపేట

పాలకొండలో గల గిరిజన బాలురు పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనం నిర్మించాలని కోరుతూ స్థానిక గిరిజనసంక్షేమాధి కారి ఎం.శ్రీనివాసరావు, ఎటిడబ్ల్యు జి మంగవేణికి ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం వినతిని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పాలకొండ గిరిజన బాలురు పోస్టుమెట్రిక్ హాస్టల్ విద్యార్థులు సొంత భవనం లేక వేర్వేరు భవనాల్లో నివసిస్తున్నార న్నారు. కనీస మౌలికసదుపాయలు లేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమ న్నారు. ప్రస్తుతం 215 మంది విద్యార్థులు రెండు భాగాలుగా వేర్వేరు భవనాల్లో ఉంటున్నారని తెలిపారు. ఈ భవనాల్లోకనీసం తాగునీరు, మరుగుదొడ్లు, స్నానానికి నీరు కూడా లేకపోవడం తో విద్యార్థులు చాలా అవస్థలకు గురవుతున్నాం న్నారు. అధికారులు సందర్శించిన ప్రతిసారి హెచ్‌డబ్ల్యులతో మాట్లాడి పోవడమే తప్ప తమ గోడు వినే పరిస్థితి లేదని విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. వెంటనే సొంత భవనం నిర్మించడానికి స్థలం, నిధులు కేటాయించి భవనం పనులు పూర్తిచేయాలని, హాస్టల్ సిబ్బందికి ప్రభుత్వమే జీతాలు చెల్లించి, వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపై సీతంపేట డిడి, పార్వతీపురం డిడితో ఫోను ద్వారా మాట్లాడించగా కొంతమంది విద్యార్థులను మరొక ప్రాంతానికి తరలించే ప్రయత్నంలో ఉన్నామని పార్వతీపురం డిడి తెలిపారు. కనీసం తాత్కాలిక భవనమైన కేటాయించి అందరి విద్యార్థులకు ఒకే చోట హాస్టల్ ఏర్పాటు చేసేలా పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.సింహాచలం కమిటీ సభ్యులు ఎన్.హరి పాల్గొన్నారు.

డిడికి వినతిని అందజేస్తున్నఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పండు, రాజశేఖర్

నులిపురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పిల్లలంతా నులిపురుగులు నిర్మూలనకు మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థుకు నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాతూ 2-19 ఏళ్లలోపు విద్యార్థులంతా ఒక ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని చెప్పారు. ఈ మాత్రలు వల్ల ఎలాంటి ఇబ్బందులుండవని, ఏ విధమైన ఇబ్బందులు తలెత్తినా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. జిల్లాలో బడికి వెళ్లే పిల్లలంతా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాధరావు, వైద్యాధికారులు భాస్కరరావు, విజయమోహన్, పి.లావణ్య. వై.యోగేశ్వర రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

కురుపాం : మండలంలోని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి బి.ప్రజ్ఞ మొండెంఖల్ పాఠశాల విద్యార్థులకు నులిపురుగులు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : విద్యార్థులు నూలు పురుగుల బారిన పడకుండా ఉండేందుకు పంపిణీ చేస్తున్న మాత్రలు సద్వినియోగం చేసుకోవాలని ఎల్విన్ పేట సర్పంచి ఆర్ చైతన్య ప్రవంతి సూచించారు. భద్రగిరి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు నూలు పురుగు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, పంచాయతీ కార్యదర్శి మీనాక శ్యామల,ఉపాధ్యాయులు ఉన్నారు.

కొమరాడ : బిఆర్ అంబేద్కర్ పాఠశాల కేజీబీవీ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో పిల్లలు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడాన్ని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి అరుణ్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మి, ఆయా పాఠశాల సిబ్బంది అంగన్వాడి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో విద్యార్థులకు నులు పురుగు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, మానస సూపర్వైజర్లు పార్వతీ, శాంతకుమారి ,నయమి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

భామిని : స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆల్బండ్జోల్ మాత్రలును ఎంఇఒ భాస్కర్‌రావు, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఫణికుమార్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సోయల్, అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ విజయ నిర్మల, ఇతర సిబ్బంది వున్నారు.

కురుపాం : విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి ప్రజ్ఞ

గరుగుబిల్లి: మండలంలోని రావివలస పిహెచ్‌సి పిల్లలకు నులిపురుగులు నిర్మూలనకు మాత్రలను జిల్లా ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రావివలస పిహెచ్‌సి వైద్యాధికారిని డాక్టర్ కర్రి అరుణకుమారి వైద్య సిబ్బంది గుంట్రెడ్డి సురేష్ కుమార్, శ్రీలత, అరుణ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలో నిడగల్లు, సూరంపేట గ్రామాల్లో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎమ్. శివున్నాయుడు, ఎ.రూపావతి, సూపర్ వైజర్స్ జయగౌడ్, గోపాలరావు, వైద్య సిబ్బంది గౌరీశ్వరి, శ్రావణి, ధరణి, అంగన్వాడి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలుగుతా

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎమ్మెల్యేగా తాను ఎక్కడైనా అవినీతి చేశానని నిరూపిస్తే రాజకీయ సన్యాసానికైనా సరే అవసరం అయితే ప్రాణత్యాగానికైనా సిద్ధమని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం టిడిపి అధినేత పార్వతీపురం పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యేపై చేసిన అవినీతి ఆరోపణలపై గురువారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా సమస్యల పరిష్కారం కోసం తన దగ్గరకు వచ్చే దరఖాస్తులపై అండార్స్‌మెంట్ సంతకాలు చేయడాన్ని ముఖ్యమంత్రి స్థాయిలో పనిచేసిన వ్యక్తి తప్పు పట్టడం అన్యాయమన్నారు. నియోజకవర్గంలో తన పేరును గానీ, తన అనుయాయుల పేరున గానీ గజం స్థలం ఆక్రమించినట్టుగా నిరూపించగలిగితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ, ఆయన సోదరులు కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో చేసిన భూముల కబ్జా గురించి ఎవర్ని అడిగినా చెబుతారని, ముందు వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. టిడిపి నాయకులు చేసిన భూకబ్జాలు నిజమైతే అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడం లేదన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ప్రస్తుతం ప్రజల సమస్యలపైనే దృష్టి పెట్టానని ఇకపై ముందు ముందు వారిపై చర్యలకు అధికారులను కలుస్తానని తెలిపారు.

బిటి రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్/సీతానగరం: మండలంలోని పులుగుమ్మి నుండి సీతానగరం పంచాయతీ రేపటివలసకు గ్రామస్తుల అభ్యర్థన మేరకు హుటాహుటిన రూ.కోటీ 23 లక్షలు నిధులు కేటాయించి నిర్మించిన బిటి రహదారిను గురువారం స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా రహదారికి నోచుకోలేని ఉత్తమ గ్రామానికి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే సేవలను గుర్తిస్తూ గ్రామస్తులు ఆయన్ను గుర్రంపై ఊరేగిస్తూ, రహదారి గుండా గ్రామంలోకి తీసుకువెళ్లి సంబరాలు నిర్వహించారు. అంతకుముందు పులుగుమ్మిలో ప్రజల తాగునీరు నిమిత్తం గ్రామంలో రూ.4.30లక్షలు నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకు పైపులైను కొళాయిలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్వతీపురం, సీతానగరం మండలాలకు చెందిన వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పర్యావరణాన్ని కాపాడాలి : ఎంపిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి బాధ్యతతో పరిరక్షించాలని, పర్యావరణాన్ని కాపాడాలని ఎంపిపి కుంబిరిక దీనమయ్య కోరారు. ఆజాదిక అమత్ మహోత్సవంలో భాగంగా మండలంలోని రెల్లలో నా భూమి నా దేశం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. దేశం కోసం పోరాడిన, ప్రాణాలర్పించిన, స్వాతంత్ర సమరయోధులు, అమరవీరులు చిహ్నంగా గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిర్మించిన శిలాఫలకాన్ని ప్రారంభించి, అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. అలాగే గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట, కేదారిపురం పంచాయతీల్లో నా భూమి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు బొత్తాడ గౌరీ శంకర్ రావు, ఆర్ చైతన్య ప్రవంతి, తులసమ్మ, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి గిరి బాబు అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎంపిపి దీనమయ్య

గరుగుబిల్లి : ఆజాదికా అమత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగానానేల, నా దేశం, నేలతల్లికి నమస్కారం కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. రావుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ ఎం.గౌరీనాథ్, సాంకేతిక సహాయకులు కొట్నాన నిర్మల, మద్రాపు భూలక్ష్మి, పద్మ, ఉమ, క్షేత్రసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సున్నావడ్డీ నగదు జమ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మహిళా సంఘాల సభ్యులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నాలుగో విడత నిధులను శుక్రవారం ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారని ఎపిఎం పి.అప్పలనాయుడు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని 39 గ్రామాలకు సంబంధించి 1307 మహిళా సంఘాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో వైయస్సార్ సున్నా వడ్డీ పథకానికి 1091 మహిళా సంఘాలకు అర్హత ఉందన్నారు. సమావేశంలో సీసీలు చందాన తిరుపతిరావు, బొంగు రామినాయుడు,వి లక్ష్మణరావు,కింజగి కష్ణ తదితరులు ఉన్నారు.

11న సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఈనెల 11న సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జిజె ప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు మండలంలోని ఉపాధి హామీ పథకం ద్వారా 816 రకాల పనులకు రూ.17 కోట్ల 11 లక్షల 49 వేల 158 లఖర్చు చేసిన వాటికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు.

ఇ-పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు వ్యవసాయ పథకాల లబ్ధి పొందాలంటే ఈ పంటలో రైతులు వేసిన పంటలన్నింటిని తప్పనిసరిగా నమోదు చేయించాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పనుకువలసలో ఇ- పంట నమోదును పరిశీలిస్తూ గ్రామ వ్యవసాయ సహాయకులు ఎలాంటి తప్పుల్లేకుండా ఈ పంట నమోదు చేయాలని, ఈ విషయమై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. పంటల భీమా, నష్ట పరిహారాలు పంటల కొనుగోలు వ్యవసాయ రుణాలు ఎరువుల సరఫరా వంటి పథకాల లబ్ధికి ఇ-పంట నమోదు తప్పనిసరి అని అన్నారు. ఇ-పంట నమోదు కాకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ ఏడాది నుంచి రైతుల పంట పొలాలు జియో టాకింగ్ విధానం ద్వారా ఈ పంటలో నమోదు కాపడతాయని, ప్రతి పంటను ఈ పంటలో తప్పనిసరిగా నమోదు చేయించుకుని ఇకపైపై చేయించుకునేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ముందుగా పంటల వారి వివరాలను సేకరించుకుని ఆ తర్వాత తప్పనిసరిగా ఇ-పంటలో నమోదు చేయాలని రైతులను తప్పనిసరిగా భాగస్వాములుగా చేయించాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎలు వినోద్ కుమార్, నాగమణి, బాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి- కొమరాడ

గుండె పోటుతో మరణించిన కెజిబివి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హిమరిక సావిత్రి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా కన్వీనర్ బి.వి.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సావిత్రి అత్తవారిళ్లైన ఊలిపిరి పంచాయతీ సరుగుడుగూడకు వెళ్లి ఆమె భర్త కామేశ్వరరావు, కుమారులు తేజ వర్ధన్, చరన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010లో ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన సర్వ శిక్షాభియాన్‌లో నియమించబడి సావిత్రి పనిచేస్తున్నారన్నారు. ఈనెల 7న కొమరాడ కెజిబివిలో బదిలీపై వచ్చి విధుల్లో చేరి కొన్ని గంటల్లో గుండెపోటుకు గురై మరణించడం చాలా విచారకరమన్నారు. ఇలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులు మాదిరిగా కాంపెన్సేషన్, తదితర సదుపాయాలు కల్పించేలా నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.సాంబమూర్తి ఉన్నారు.

రూ.2 లక్షలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత నెల 11న భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న జియమ్మ వలస మండలం చింతల బెలగాంకు చెందిన మద్రాపు శ్రీనివాసరావు ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన విషయం తెలిసిందే. తోటపల్లి ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుకు స్థానిక నాయకులు ఈ విషయాన్ని తెలియజేశారు. స్పందించిన ఆయన పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకోవాలని ఉద్దేశంతో రెండు లక్షల ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. మృతుడు శ్రీనివాస రావు కుమార్తెకు ఉద్యోగం కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. రెండు లక్షల నగదును కురుపాం నియోజకవర్గ ఇంచార్జి తోయక జగదీశ్వరి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగంపేట అంబేద్కర్ గురుకుల కళాశాలలో ఆరోగ్యం పై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రత పాటించాలన్నారు. దీనివల్ల కొన్ని వ్యాధులు నివారించవచ్చునన్నారు. నులి పురుగులు నివారణ టాబ్లెట్లు అందరు వేసుకోవాలని ఆమె కోరారు. ప్రతి విద్యార్థికి టాబ్లెట్లు వేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఈశ్వరరావు, వైద్య సిబ్బంది డి. సత్యవతి, కె. సింహాచలం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - సాలూరు

పట్టణం లోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులతో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కె.సాయి శ్రీనివాసరావు ఆధ్వర్యాన విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్తగా చేరిన విద్యార్థుల్లో బిడియం, సిగ్గు పోగొట్టడానికి ఫ్రెషర్స్ డే నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంతిలాల్ దండేకు హిజ్రాల వినతి

ప్రజాశక్తి - కురుపాం

ఆదివాసీ దినోత్సవం సాలూరు విచ్చేసిన గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండేకు కురుపాం నియోజకవర్గ హిజ్రాల అసోసియేషన్ అధ్యక్షులు అడ్డాకుల గీతారాణి తమ సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ పార్వతీపురం పాలకొండ సబ్-డివిజన్ పరిధిలో సుమారు 500 నుండి 600 మంది ట్రాన్స్ జండర్స్ ఉన్నామని, తామంతా ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో నివసిస్తూ ఆదివాసీ తెగలకు చెందిన వారమైనా కనీస అవసరాలకు నోచుకోలేకపోతున్నామని అన్నారు. ట్రాన్ జండర్స్ కమ్యూనిటీ కోసం భవనం, ట్రాన్ జండర్లకు ప్రత్యేకంగా కార్పొరేషన్, ఇళ్ల స్థలాలు, పై చదువులు చదివిన వారి సర్టిఫికెట్లల్లో వారి పేర్లను మార్చేలా చూడాలని తదితర సమస్యలపై వినతిపత్రం అందించామన్నారు. కార్యక్రమంలో జిల్లాలో గల హిజ్రాలు పాల్గొన్నారు.

పామాయిల్‌కు మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

పామాయిల్ పండించిన రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు మద్దతు ధర కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. రోజురోజుకు పతనమైపోతున్న పామ్ ఆయిల్ ధరను చూసి రైతు పంట పొలాల్లో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరిలో టన్ను పామ్ ఆయిల్ గెల రూ.13,760 ధర ఉండగా జులై నాటికి రూ.12493కి తగ్గిందన్నారు. పక్క రాష్ట్రం తెలంగాణలో పామాయిల్ రైతులను ఆ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటే మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనీసం పామాయిల్ రైతులు వైపు చూడను పరిస్థితి ఉందని అన్నారు. ఇప్పటికైనా పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర టన్నుకు రూ.20వేలు ఇవ్వాలని, ఎరువులు, మొక్కలు, పామాయిల్ తోటలకు సంబంధించి ఇతర సామగ్రి వెంటనే సబ్సిడీ రూపంలో ఇచ్చి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

17 వరకూ ప్రవేశాలకు గడువు

ప్రజాశక్తి- పాలకొండ

ఇంటర్మీడియట్ ఒకేషనల్ విభాగంలో నిర్వహిస్తున్న పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 17 చివరి తేదీ అని, దీనిని అర్హత గల విద్యార్థులు వినియోగించుకోవాలని స్థానిక బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉత్తరావల్లి సత్యప్రభ కోరారు. పదవ తరగతి పాసైన విద్యార్థినులు, ఇంటర్ చదివి ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా ప్రవేశాలకు అర్హులేనన్నారు. తమ కళాశాలలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ గ్రూపుల్లో అందు బాటులో సీట్లు ఉన్నాయని, ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. రెండేళ్ల కోర్స్ పూర్తయిన వెంటనే, ఒక ఏడాది పాటు అప్రెంటిస్ షిప్ పూర్తి చేసుకుంటే ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేట్ విభాగాలకు చెందిన రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. జనరల్ విభాగంలోనూ ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపుల్లోనూ ప్రవేశాలు పొందేందుకు ఈనెల 17 చివరి తేదీ అని వివరించారు.

పాలకొండలో 'మేరీ మాటి.. మేరా దేశ్'

పాలకొండ: " మేరీ మాటి, మేరా దేశ్ " కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక నగర పంచాయితీ కార్యాలయం వద్ద జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. నగర పంచాయితీలో ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, వైస్‌చైర్మన్లు రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు సెల్ఫీలు తీసుకుని, వెబ్ సైట్ లో ఫోటోలను అప్లోడ్ చేసి సర్టిఫికేట్లను తీసుకున్నారు. అనంతరం కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేసి మట్టి దీపాన్ని చేతిలో ఉంచుకుని నా భూమి, నాదేశం (నేలకు నమస్కారం, వీరులకు వందనం) చేశారు. అనంతరం నగర పంచాయితీలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్, రిటైర్డ్ హవల్దార్ దుప్పాడ పాపినాయుడుకు సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ టి. జయరాం, నగర పంచాయితీ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

108 కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

స్థానిక ఇందిరా నగర్ కాలనీ సమీపంలో పాత పౌర సరఫరాల శాఖ కార్యాలయం వద్ద 108 ఫ్లీట్ కార్యాలయాన్ని రాష్ట్ర 108 ఫ్లీట్ హెడ్ వరప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇంతకు ముందు నియోజకవర్గంలోని అన్ని 108, 104, 102 వాహనాలు మరమ్మతులు నిమిత్తం శ్రీకాకుళం, విజయనగరం పార్వతీపురం వరకు వెళ్లాల్సి వచ్చేది. ఇకపైన పాలకొండ కేంద్రంలోనే ఈ వాహనాలు అన్నీ మరమ్మతులు జరిపించి, ఈ వాహనాలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని వరప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పార్వతీపురం జిల్లాల ఫ్లీట్ మేనేజర్లు రవికిరణ్, భాస్కర్, జగ్గరాజుతో పాటుగా శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల 108 జిల్లా మేనేజర్లు మన్మదనాయుడు, నజీర్ హుస్సేన్, 104 జిల్లా మేనేజర్ దుర్గా ప్రసాద్, నాలుగు జిల్లాల ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌లు విజయకుమార్, ప్రదీప్, రాజశేఖర్, షణ్ముఖరావు, సంతోష్, గిరిబాబు, 108 సిబ్బంది గణపతి, కాంబాబు, రేరాజు, రవిబాబు, రాములు, సంతోష్, తేజ, అనంతరావు, మోహన్, రవికుమార్ శివ, పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన మావుడి

మక్కువ: వైసిపి మాజీ మండల అధ్యక్షులు, న్యాయవాది, వ్యాపారవేత్త మావుడి ప్రసాదరావు నాయుడు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మండలంలో టిడిపితో అనుబంధం ఉన్న మావుడి కుటుంబంతో చర్చలు జరిపి పార్టీలో చేర్పించారు. అంతా కష్టపడి పనిచేయాలని చంద్రబాబు వీరికి సూచించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.సంధ్యారాణి, మండల టిడిపి అధ్యక్షులు జి.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు

వాటర్ ట్యాంకు పరిశుభ్రం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ధోనుబాయి రహదారి సమీపానున్న రక్షిత మంచినీటి పథకాన్ని కార్యదర్శి బి.సుదర్శన్‌రావు బ్లీచింగ్‌తో శుభ్రం చేయించారు. వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. బ్లీచింగ్‌తో క్లోరిక్యులేషన్ చేస్తున్నామని తెలిపారు.

చీకటిమయంలో పాలకొండ

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

నగర పంచాయతీలో కొద్ది రోజులుగా వీధిదీపాలు వెలగక రాత్రయితే చీకటిమయంగా మారుతుంది. ప్రధాన రహదారులతో పాటు పట్టణంలో పలు వీధుల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యాలాం జంక్షన్, ముదునూరువారి వీధి, కోమటిపేట, గురువుగారివీధి తదితర ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రయితే ప్రజలు రోడ్డుపై నడవడానికి కూడా ఆందోళన చెందుతున్నారు. కోట్లు రూపాయలు ఆదాయం ఉన్న నగర పంచాయతీలో సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, పాలకులు చొరవచూపడం లేదు. దీంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల నుంచి భారీ స్థాయిలో ఇంటిపన్నులు వసూలు చేస్తున్నప్పటికీ ఆ స్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని భార్య మృతి

భర్తకు గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/సీతానగరం

పార్వతీపురం నుండి ద్విచక్ర వాహనంపై బొబ్బిలి వెళ్తున్న నూతన దంపతులను గురువారం ఉదయం సీతానగరం మండలం గుచ్చిమి సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా భార్య కొత్తకోట అమూల్య (24) మృతి చెందగా, భర్త దినేష్‌కు గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొబ్బిలి దేవాంగుల వీధికి చెందిన ఈ జంటకు రెండు నెలల క్రితమే పెళ్లయింది. దినేష్ రెండు రోజుల క్రితమే హైదరాబాదు నుండి వచ్చి భార్యను తీసుకువెళ్లడానికి సన్నాహాలు చేస్తుండగానే ఈ సంఘటన జరగడం వారి కుటుంబాల్లో తీవ్ర దుఃఖం నింపింది. జిల్లా కేంద్రాసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొలం తగాదాలో వ్యక్తికి గాయాలు

పార్వతీపురం రూరల్: కొమరాడ మండలం లొద్ద గ్రామానికి చెందిన ఊయక నూకయ్య అనే వ్యక్తిపై గురువారం ఉదయం అతని అన్న కుమారుడు ఊయక కొత్తన్న పొలం నీటి విషయంలో ఏర్పడిన తగాదా కారణంగా దాడి చేసి నూకయ్య తలపై గాయ పరిచాడు. స్పందించిన కుటుంబీకులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

పోర్టపైడి అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా గద్దియ్య

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ పోర్టపైడి అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శిగా గొర్లె గద్దియ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని రాష్ట్ర అధ్యక్షుల పి. రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా గంట అప్పన్న, జిల్లా అధ్యక్షులుగా బిడ్డిక సుధాకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మండంగి హరినాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా వారి సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేస్తామని వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతామని అన్నారు.

విద్యార్థులకు కళాశాల చైర్మన్ అభినందన

సాలూరు: పట్టణంలోని శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలకి బిఎస్‌సి కంప్యూటర్, బికాం కంప్యూటర్స్ కోర్సుల్లో ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో మూడో స్థానం సాధించిన విద్యార్థులు పెదపాటి మోహిత, పోతల శివకుమార్‌లను కళాశాల చైర్మన్ డాక్టర్ కొల్లి స్వాములు గురువారం అభినందించారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని పుష్పగుచ్ఛంతో అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.భాస్కరరావు, సిహెచ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల ధర్నా

గుమ్మలక్ష్మీ పురం: తపాలా శాఖలో అదనపు డిపార్ట్మెంట్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరికీ 8 గంటల పని, పెన్షన్ సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని స్థానిక పోస్టల్ ఈడీ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సబ్ పోస్టు ఆఫీసు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిడిఎస్ ఉద్యోగుల సంఘ నాయకులు జి.చిన్నంనాయుడు, ఎ.జయంతిరావు, ఎస్.కల్యాణి, పి. సత్యనారాయణ, బి.రాజేష్, గుమ్మలక్ష్మీపురం, మొండెఖల్ సబ్ పోస్ట్ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పార్వతీపురం రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు ఆధ్వర్యంలో అర్థశాస్త్రం అధ్యాపకులు తెర్లి రవికుమార్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ పంపిణీకి సహాయ సహకారాలు అందించిన రవి కుమార్‌ను కళాశాల సిబ్బంది అభినందించారు. విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మజ్జి తాతబాబు, శ్రీనివాసరావు, తేజ, తవిటినాయుడు, శర్మ, లక్ష్మణరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సామర్థ్యాలను తల్లిదండ్రులు తెలుసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: చదువులో విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందని మండలంలోని చింతలగూడ ఎయిడెడ్ పాఠశాల మేనేజర్ బిత్తిక భాస్కరమూర్తి నాయుడు అన్నారు. పాఠశాలలో నిర్వహించిన ఫార్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు, విద్యార్థుల సామర్థ్యాలపై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.కుమారస్వామి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆరిక రవికుమార్ ఉన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస,పెదగుడబ పంచాయతీల్లో ఒక్కొక్క వార్డు మెంబర్ ఎన్నికలకు సంబంధించి గురువారంతో నామినేషన్ల ఘట్టం ముగిసిందని ఎంపిడిఒ జి పైడితల్లి, ఇఒపిఆర్డి ఎల్.గోపాలరావు తెలిపారు. ఈ రెండు గ్రామపంచాయతీల వార్డు మెంబర్ల ఎన్నికల సంబంధించి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే అందినట్లు పేర్కొన్నారు. గొట్టివలస వార్డుమెంబర్ ఎన్నికకు సంబంధించి ఒక నామినేషన్ వచ్చిందని ఎన్నికల అధికారి గోపి, గౌరీశంకర్‌రావు తెలిపారు. పెదగుడబ వార్డు మెంబర్ ఎన్నికకు సంబంధించి ఒక నామినేషన్ అందిందని ఎన్నికల అధికారి మహ్మద్ ఫరూక్ సైపుద్దీన్ తెలిపారు.

అన్నా క్యాంటీన్ సిబ్బందికి జీతాలు ఇప్పించండి

పార్వతీపురంరూరల్: టిడిపి అధికారంలో ఉన్నప్పుడు పార్వతీపురంలో ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేసిన తనకు నాలుగేళ్లుగా జీతం అందలేదని, వెంటనే జీతం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని పార్వతీపురం పట్టణం వైకెఎం నగర్‌కు చెందిన సంగం అనే వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు మాసాలు తర్వాత రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడనుందని అప్పుడు అన్నా క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని అప్పుడు బకాయిలతో సహా జీతం చెల్లించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అంగన్వాడీ చిన్నారులకు విద్యుత్ కష్టాలు

కురుపాం: ప్రీస్కూల్ పిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో ఉంచి పౌష్టికాహారం లోపం లేకుండా ఉండటానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఐసిడిఎస్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. అయితే అంతవరకు బాగానే ఉన్నప్పటికీ విశ్రాంతి సమయంలో పిల్లలు కునుకు తీయడానికి అంగన్వాడీ కేంద్రంలో కరెంట్ లేకపోవడంతో పిల్లలను కేంద్రంలో ఉంచడానికి ఇష్టపడక తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లి పోతున్నారు. ఇదే పరిస్థితిలో కొందరు పిల్లలు కేంద్రంలో ఉండలేక అంగన్వాడీ వర్కర్లు అట్టలతో విసురుతూ పడుకోబెడుతున్నారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో కరెంటు సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

గిరిజన సమస్యలపై చంద్రబాబుకు వినతి

బెలగాం: గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందించినట్లు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్ తెలిపారు. ఈమేరకు వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో ఎఎన్ఎంలను నియమించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, పెండింగ్ డైట్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. బిటిడిపి పాలకవర్గ సమావేశం నిర్వహిస్తూ గిరిజన సమస్యలపై చర్చించేలా చర్యలు చేపట్టాలని కోరారు. జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలని కోరారు.

నెరవేరిన కిచ్చాడ ప్రజల కల

కురుపాం: కిచ్చాడ గ్రామపంచాయతీ ప్రజల దశాబ్దాల కల నెరవేరిందని స్థానిక సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల తరబడి బిటి రహదారి నుండి కిచ్చాడ వరకు మూడు కిలోమీటర్ల మేరకు మట్టి రహదారే ఉండేదని, ప్రభుత్వాలు ఎన్ని మారినా తమ గ్రామ ప్రజల సమస్యను పట్టించుకోలేదన్నారు. వర్షాకాలంలోనూ, ఆరోగ్యం బాగోలేనప్పుడు అత్యవసర సమయంలో ఈ రహదారి వెంట ప్రయాణించాలంటే నరకయాతనగా ఉండేదని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి చొరవతో తమ గ్రామానికి రహదారి మంజూరు చేయించి పనులు పూర్తి చేయించేంత వరకు బాధ్యతలు తీసుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పూర్తయిన రహదారి పనులను అయ్యర్కల కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ చంద్రశేఖర్, గ్రామ పెద్దలతో కలిసి పరిశీలించారు.

గంగాపురంలో ఫ్యామిలీ డాక్టర్

పార్వతీపురం రూరల్: మండలంలోని గంగాపురంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గురువారం డోకిశిల పిహెచ్‌సి వైద్యాధికారి ఐశ్వర్య వైద్య సేవలు అందించారు. గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 48 మందికి వైద్య సేవలు అందించామన్నారు. గ్రామంలో వైద్య శిబిరంపై ముందస్తు సమాచారం అందించడంతో విశేష స్పందన లభించిందన్నారు. గ్రామంలో 62 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, 18 రకాల రక్త పరీక్షలు గ్రామాల్లోని నిర్వహిస్తున్నామన్నారు.

బాధ్యత గల పౌరులుగా మెలగాలి

గుమ్మలక్ష్మీపురం: అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకొని కొనియాడాలని, వారి ధైర్యసాహసాలు ఆదర్శంగా తీసుకుని సమాజంలో బాధ్యత పౌరులుగా మెలగాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం అన్నారు. ఆజాద్‌కి అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులన్న సూక్తిని పాటిస్తూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. ఆర్మీలో పని చేస్తూ రిటైర్ అయి ప్రస్తుతం కేదారిపురం స్టేట్ బ్యాంకులో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్న అభిమన్యును సత్కరించారు.